క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి కృషి



ఫిరంగిపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని గుంటూరు జిల్లా వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీల విభాగ అధ్యక్షుడు ఉడుముల పిచ్చిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం పార్టీ బూత్ కమిటీల విభాగ అధ్యక్షుడిగా నియమితులైనందున పిచ్చిరెడ్డిని శాలువా, పూలమాలతో సన్మానించారు. తనకు పదవి రావడంలో సహకరించిన నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు, జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, పార్లమెంటు పార్టీ ఇన్‌చార్జి మోదుగుల వేణుగోపాలరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డిలకు పిచ్చిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బి.అంజిరెడ్డి, డి.సురేష్, బాలిరెడ్డి, చేపూరి రామమోహన్ రెడ్డి, మోరం శ్రీనివాసరెడ్డి, సయ్యద్ సైదులు, సాల్మన్, ప్రతాప్, శ్రీను పాల్గొన్నారు.

రైల్వేగేటు మూసివేతతో ప్రజల ఇక్కట్లు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని అల్లంవారి పాలెం వద్దనున్న రైల్వేగేటు మరమ్మతుల కోసం శుక్రవారం మూసివేశారు. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. కాగా మరామ్మతులపై గ్రామస్తులకు తెలపకుండా రైల్వే అధికారులు పనులు నిర్వహించుతుండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గేటు మీదుగా పలు గ్రామాలకు వెళ్లే వారు రైల్వే అండర్ బ్రిడ్జి మీదుగా చుట్టు తిరిగి వెళ్లాల్సి రావడం, బ్రిడ్జి వద్ద నీరు నిలిచి ఉండటంతో ఇబ్బంది పడాల్సి వస్తుందని చెబుతున్నారు. అంతేకాక మరమ్మతులకు సంబంధించి బ్యానర్ ఏర్పాటు చేయకపోవడంతో పెద్ద వాహనాలు గేటు వరకు వచ్చి వెనుదిరిగి వెళ్లాల్సి వచ్చిందని వాహనదారులు చెబుతున్నారు.

ప్రభుత్వం కార్మికుల సమస్యను పరిష్కరించాలి

తాడేపల్లిరూరల్ : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ కోరారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను నాయకులు గురవయ్య, అంకయ్య, సాంబశివరావులతో కలిసి ప్రారంభించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు 269 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.


రైతులకు రాయితీపై డ్రోన్‌లు అందజేత



వడ్డమాను(తాడికొండ): తుళ్ళూరు మండలం వడ్డమాను గ్రామంలో రాయితీపై డ్రోన్‌లు అందజేసినట్లు మండల వ్యవసాయాధికారి పి.సంధ్యారాణి తెలిపారు. ప్రభుత్వం 80 శాతం రాయితీపై అందజేస్తున్న ఈ డ్రోన్ల ఖరీదు రూ.9,80,000 కాగా రాయితీ పోను గ్రూపు వాటా రూ.1,96,000కు ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతవరం యూనియన్ బ్యాంక్ మేనేజర్ కె.చిట్టిబాబు రైతులను అభినందించారు. వ్యవసాయంలో యాంత్రీకరణ దిశగా వెళ్లడం వలన ఖర్చులు తగ్గుతాయన్నారు. తమ బ్యాంకు ద్వారా రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు.

ప్రాధాన్యతా క్రమంలో అర్జీలకు పరిష్కారం

సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్



తాడికొండ: ప్రాధాన్యతా క్రమంలో రైతులు అందజేసిన అర్జీలన్నిటికీ పరిష్కారం చేస్తామని సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ జి సూర్యసాయి ప్రవీణ్‌చంద్ అన్నారు. రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. వార్షిక కౌలు చెల్లింపు, ల్యాండ్ పూలింగ్ స్కీం, నెగోషియేటెడ్ సెటిల్మెంట్ పాలసీ(ఎన్‌ఎస్‌పీ), రిటర్నబుల్ ప్లాట్ల అలాట్‌మెంట్, రిజిస్ట్రేషన్, అసైన్డ్ ల్యాండ్ సమస్యలు, గ్రామ కంఠాలు తదితర సమస్యలపై పలువురు రాజధాని ప్రాంతవాసులు అర్జీలను 'గ్రీవెన్స్ డే'లో అడిషనల్ కమిషనర్‌కు అందజేశారు. అర్జీదారుల సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని, వార్షిక కౌలు సంబంధిత అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు.

బాబు ష్యూరిటీకి గ్యారంటీ ఉండదు

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



మాట్లాడుతున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

కురగల్లు(మంగళగిరి): ముఖ్యమంత్రి చంద్రబాబు ష్యూరిటీలకు గ్యారంటీ ఉండదని, చంద్రబాబు హామీలను ప్రజలు నమ్మడం లేదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం మండలంలోని కురగల్లు గ్రామంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు నాలి వెంకటకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డీవీఆర్ మాట్లాడుతూ చంద్రబాబు చెప్పే మాటలు, హామీలు అన్నీ బూటకమేనన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలను నిలువునా మోసం చేసిన ఘనత చంద్రబాబుకు దక్కిందన్నారు. వరద నీరు వలన రైతులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెబితే అక్రమ కేసులు పెట్టిన ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు ఎంతో దూరంలో లేవన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా రైతుల తరపున వైఎస్సార్‌సీపీ నిలబడుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం మానుకుని రాష్ట్ర అభివృద్ధి గురించి ఆలోచించాలని హితవు పలికారు. వైఎస్సార్ పథకాలను అమలు చేయడంతో పాటు ఎన్నో పథకాలను అందించి పేదలను ఆర్థికంగా అభివృద్ధి చేసిన నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి అని స్పష్టం చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేసిందని, నేడు కనీసం యూరియా సరఫరా చేయలేకపోవడం రైతులను మోసం చేయడమేనన్నారు. కార్యక్రమంలో కురగల్లు గ్రామ అధ్యక్షుడు మైలా పరమేశ్వరరావు, నియోజకవర్గ ఇంటలెక్చువల్ విభాగ అధ్యక్షుడు జంగా నాగిరెడ్డి, యువజన విభాగ అధ్యక్షుడు సయ్యద్ గౌస్ మొహిద్దీన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కట్టిపోగు భూషణం, బీసీ విభాగం అధ్యక్షుడు తాడిబోయిన సుబ్బారావు, మండల కార్యదర్శి మందా విజయ్‌బాబు, మాజీ ఉపసర్పంచ్ కట్టిపోగు వెంకటేశ్వరరావు, తోట మురళి, గోపికృష్ణ, కట్టిపోగు శేషయ్య, ఏడుకొండలు, శ్రీనివాసరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం

కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోంది



మాట్లాడుతున్న చెంగయ్య

మంగళగిరి టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య విమర్శించారు. నగర పరిధిలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం సీఐటీయూ పట్టణ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెంగయ్య మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ రద్దు చేసి కార్మిక హక్కులను కాలరాసే విధానాన్ని తీసుకువచ్చిందని అన్నారు. కార్మికుల హక్కుల కోసం నిరంతరం పనిచేసేది సీఐటీయూ మాత్రమే అని పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో రంగంలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. 2026 జనవరి 4వ తేదీన జరిగే సీఐటీయూ జాతీయ మహాసభలకు మంగళగిరి నుంచి కార్మికులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వై.కమలాకర్, ఎం.బాలాజీ, జె.వి.రాఘవులు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



తెలుగు భాష, క్రీడా ఉపాధ్యాయులను సత్కరించిన దృశ్యం

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ముందుగా గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు కాకుమాను జోజప్ప మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటున్నామని వివరించారు. తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. క్రీడల ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. అనంతరం తెలుగు భాషా ఉపాధ్యాయులు డాక్టర్ తోట శ్రీనివాసరావు, ఇసుకపల్లి శరత్‌చంద్ర, విజయకుమారి, డ్రిల్ మాస్టర్లు మెల్లెంపూడి రవి, నూతక్కి రవిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బలక్ష్మి, కె.శ్రీరామ్ చంద్రరెడ్డి, అన్నం వెంకటేశ్వరరావు, కొల్లి ఉమాదేవి పాల్గొన్నారు.

తెలుగు భాష అమ్మవంటిది

మంగళగిరి టౌన్: తెలుగు భాష అమ్మవంటిదని అలాంటి భాషను మరువకూడదని మంగళగిరి సాహితీ కళావేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు తెలిపారు. నగర పరిధిలోని ఆత్మకూరు నిర్మలా ఫార్మసీ కళాశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తికొండ ధనుంజయరావు మాట్లాడుతూ తెలుగు భాషపై విద్యార్థులు ఆసక్తి చూపాలని సూచించారు. మానవతా వేదిక కన్వీనర్ గోలి మధు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తెలుగు భాషను కాపాడుకోవాలన్నారు. అనంతరం తెలుగు భాష ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. తెలుగు భాష ప్రాముఖ్యత అనే అంశంపై జాతీయ సేవా పథకం, లైబ్రరీ సెల్, మంగళగిరి సాహితీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి, విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పాములు రెడ్డి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సిస్టర్ జి.నిర్మలాజ్యోతి, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ నరేష్‌బాబు, లైబ్రరీ సెల్ కో ఆర్డినేటర్ షేక్ రష్మా తదితరులు పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తికి ఘన నివాళి

దుగ్గిరాల: తెలుగు గ్రాంధిక వచనాన్ని వ్యావహారిక భాషలోకి తీసుకురావడానికి కృషి చేసిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి పంతులు అని హెచ్ఎం ఎస్.శోభాదేవి అన్నారు. శుక్రవారం దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం గిడుగు చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా, చరిత్ర పరిశోధకుడిగా, విద్యావేత్తగా, వక్తగా పేరొందిన గిడుగు జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామని, గిడుగు చేపట్టిన ఉద్యమం అసామాన్యమైనది, తెలుగు భాషకు ఆయన కృషి అనుపమానమైనదని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరవిందలో...

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో ఉన్న అరవింద హైస్కూల్‌లో శుక్రవారం తెలుగు భాషా, క్రీడా దినోత్సవాలను పురస్కరించుకుని గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ ఇంద్రాణి మాట్లాడుతూ విద్యార్థులు గిడుగు జీవిత విషయాలను, తెలుగు భాష గొప్పదనం తెలిపే చార్టులను తయారు చేసి ప్రదర్శించారని పేర్కొన్నారు. క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జీవిత విశేషాలను, క్రీడల వలన లాభాలను వివరిస్తూ చార్ట్‌లతో పాటు ఆట వస్తువులను ప్రదర్శించారని తెలిపారు. విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. విద్యార్థులకు క్రీడల పోటీలు నిర్వహించారు. పాఠశాల కో ఆర్డినేటర్ పద్మ, హెచ్ఎం రవిశంకర్, పీటీ శ్రీనివాస్ పాల్గొన్నారు.



నిర్మలా ఫార్మసీ కళాశాలలో ప్రశంసాపత్రాలతో విద్యార్థులు



గిడుగు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న హెచ్ఎం శోభాదేవి, ఉపాధ్యాయులు



అరవిందలో క్రీడా పోటీల్లో విద్యార్థులు

గుంతలు పూడ్చిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్



మాతాశ్రీ ఆశ్రమం ఎదురురోడ్డులో రోడ్డుపై ఉన్న గుంతలు పూడుస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి నులకపేట నుంచి మాతాశ్రీ ఆశ్రమం ఎదురుగా కొలనుకొండ వెళ్లే రహదారిలో ఏర్పడిన గోతులను కార్పొరేషన్ అధికారులు శుక్రవారం పూడ్చారు. సాక్షిలో 'రోడ్డుపై గుంతలు తప్పని తిప్పలు' శీర్షికతో శుక్రవారం వచ్చిన కథనానికి స్పందించిన కమిషనర్ అలీమ్ బాషా ఆ గోతులను వెంటనే పూడ్చాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించడంతో వారు తాత్కాలికంగా బేబీ చిప్స్ పౌడర్‌తో గోతులను పూడ్చారు. త్వరలోనే ఆ రహదారిలో పటిష్టంగా బీటీ రోడ్ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

పేరేచర్ల సెంటర్‌లో మేడికొండూరు పోలీసుల దందా!

వాహనదారుల నుంచి బలవంతపు వసూళ్లు



వాహనదారుడు నుంచి డబ్బులు తీసుకుంటున్న దృశ్యం

మేడికొండూరు : మండలంలోని పేరేచర్ల సెంటర్‌లో ఓ కానిస్టేబుల్ బహిరంగంగా వాహనదారుల నుంచి అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి గొర్రెల మందతో వస్తున్న ట్రాక్టర్లు, ఆటోలు, లారీలు, లోడింగ్ వాహనాలను ఆపి అక్రమంగా వసూలు చేస్తున్న దృశ్యాలు పెద్ద దుమారమే రేపాయి. డబ్బులు ఇవ్వకపోతే వాహనాలను నిలిపేసి వేధింపులకు గురిచేస్తున్నారని పలువురు డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సెంటర్‌లో విధి నిర్వహణ పేరుతో బహిరంగంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ వ్యవహారం పేరేచర్ల మొత్తం వైరల్ అవుతుండటంతో పోలీసుల ప్రతిష్టకే మచ్చ పడిందని పలువురు పేర్కొన్నారు.

పత్తిలో సస్యరక్షణపై అవగాహన

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో పత్తిలో గులాబీరంగు, కాయతొలుచు పురుగు నివారణపై రైతులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సీనియర్ శాస్త్రవేత్త వెంకటలక్ష్మి మాట్లాడుతూ గులాబీరంగు పురుగు నివారణకు వేసవిలోనే దుక్కులు దున్నుకోవాలన్నారు. పంట వేసిన తరువాత గొర్రెలను పొలంలో మేయించేలా చూడాలని చెప్పారు. 50 నుంచి 70 రోజుల మధ్య ఎకరాకు నాలుగు నుంచి ఆరు లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలన్నారు. మొదటి దశలో వేపగింజల కషాయాన్ని చల్లించుకొని గమనించాలని చెప్పారు. పురుగు మోస్తరుగా ఉన్నప్పుడు ట్రైజోఫాస్ మందు వాడుకోవాలన్నారు. పదేళ్లుగా గులాబీరంగు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని దీని నివారణకు రసాయన మందులతో పాటు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సమీపంలోని పత్తి పొలాన్ని పరిశీలించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏవో వాసంతి, విస్తరణాధికారి షేక్ సుబానీ, నాగేశ్వరరావు, కిరణ్, ప్రశాంతి, రైతులు పాల్గొన్నారు.

యూరియా కొరకు రైతుల తిప్పలు



దుగ్గిరాల: ప్రతిరోజు దుగ్గిరాల సొసైటీ దగ్గర రైతులు బారులు తీరుతున్నారు. శుక్రవారం దుగ్గిరాల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం వద్ద రైతులు గుమిగూడి ఉన్నారు. దీనిపై ఏవో ఆర్.విజయ బాబును వివరణ కోరగా ప్రభుత్వ సొసైటీలకు 70 శాతం, 30 శాతం ప్రయివేటు దుకాణాలకు ఇవ్వడం వల్ల కొద్దిగా రద్దీ ఉన్నదని, అలాగే స్టాక్ గోడౌన్‌లకు చేరినా అకనాల్డెజ్‌మెంట్ నంబరు ఆలస్యంగా రెండు, మూడు రోజులకు రావడం వల్ల రైతులకు అందించడం ఆలస్యం అవుతుందని, ప్రతి రైతు ఈ పోస్ మిషన్‌లో బయోమెట్రిక్ వేసి అందించడం వల్ల కూడా రైతులు ఎక్కువ సమయం ఎదురుచూడాల్సిన పరిస్థితి వస్తుందని, సాధ్యమైనంత త్వరగా అందించడానికి ప్రయత్నిస్తున్నామని, రైతు సోదరులు గమనించాలని ఆయన అన్నారు.

హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని పెనుమాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మారుతీ మహిళా సొసైటీ పీయూ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ జి.గంగాభవాని మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం సహకారంతో ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తికి కారణాలు, లక్షణాలు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ఈ వ్యాధి సోకిన వారి పట్ల వివక్షత చూపరాదని, చికిత్స, ఏఆర్‌టీ మందులు, టోల్‌ఫ్రీ నెంబర్ 1097 తదితరాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ జి.రామచంద్రరావు, జి.ప్రసాదరావు, అధ్యాపక సిబ్బంది, మారుతి మహిళా సొసైటీ ప్రాజెక్ట్ సిబ్బంది, ఏఎన్ఎం ప్రత్యూష, ఓఆర్ డబ్ల్యూ అరుణ, సాయిసుధ, సారాకుమారి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

దుగ్గిరాల: పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వెంకట రవి తెలిపారు. శుక్రవారం ఉదయం మంచికలపూడి–కంఠంరాజుకొండూరు గ్రామాల మధ్య ఉన్న కొబ్బరి తోటల్లో పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.7,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.